ఏ పనికైనా లంచమే!

మూడోపేజీ తరువాయి...

ఓటేసిన నాయకుల వద్దకు సమస్యలు పరిష్కరించాలని పోతే కలవడం లేదని, వారి కోసం చెప్పులరిగేలా తిరగాల్సి వస్తున్నదని వాపోయారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై యూత్ ఫర్ యాంటీ కరప్షన్ (వైఏసీ) సంస్థ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సర్వే రిపోర్టును సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ బుధవారం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన 14,3456 మంది 19 నుంచి 60 ఏండ్ల రైతులు, ఉద్యోగులు, మహిళలు, పురుషుల నుంచి అభిప్రాయాలు సేకరించి రిపోర్టును వైఏసీ ప్రచురించింది. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో అవినీతిపై అధికారులు, నాయకుల పనితీరుపై ఆ సంస్థ వలంటీర్లు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో గ్రామం, పట్టణం, నగరంవారీగా అన్నివర్గాల ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలతో రిపోర్టు సిద్ధం చేసింది. ఈ సర్వేలో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి. రిపోర్టును ప్రభుత్వంతోపాటు ప్రతిపక్ష పార్టీలకు అందజేస్తామని వైఏసీ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి చెప్పారు. రాష్ట్రంలో ఏడాది కాంగ్రెస్ పాలన, సమాజంలో అవినీతి, రాజకీయ నాయకుల తీరు వంటి 13 ప్రశ్నలతో సర్వే నిర్వహించగా అధిక శాతం ప్రజలు అసంతృప్తి వ్యక్తంచేసినట్టు తెలిపారు.

అవినీతిరహిత సమాజం కావాలి

అవినీతిరహిత సమాజం కోసం, పారదర్శక పాలన కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. అన్నిరంగాల్లో అవినీతి పెచ్చరిల్లుతున్నదని, సంస్కరణల ద్వారా అవినీతిని పూర్తిగా నిర్మూలించవచ్చని సూచించారు. ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ పేమెంట్లు అన్ని శాఖల్లో పూర్తిస్థాయిలో అమలుచేయాలని చెప్పారు. నిజాయితీతో పనిచేస్తానని ప్రతి కార్యాలయంలో ఉద్యోగి సీటు వెనుక సూక్తి రాయాలని గతేడాది ప్రభుత్వానికి సూచించినట్టు తెలిపారు. వైఏసీ సంస్థ పదేండ్లుగా సమాజంలో మార్పు కోసం ఎన్నో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమాచార హక్కు చట్టాన్ని ఆయుధంగా మార్చుకొని ప్రజలకు అనేక అంశాల్లో అవగాహన కల్పిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కొన్నె దేవేందర్, కోమటి రమేశ్‌బాబు, గీతానంద్, ప్రదీప్‌రెడ్డి, బత్తిని రాజేశ్, కొక్కుల ప్రశాంత్, నాగేంద్ర, నరేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి ఉన్నదా?
చాలా ఉన్నది: **76%**
సాధారణంగా: **14%**

లంచం ఇవ్వకపోతే పనులు కావడం లేదా?
కావడం లేదు: **47.9%**
అధికార్లు ఇబ్బంది పెడుతున్నరు: **28.4%**

లంచం ఎలా ఇస్తారు
డబ్బు రూపంలో: **63.7%**
వస్తు రూపేణా: **34.2%**

మీ ప్రాంతంలో నిజాయితీ అధికారులున్నారా
లేరు: **63%**
ఉన్నారు: **20%**

ఏసీబీ, సీబీఐ, ఈడీ వల్ల అవినీతి తగ్గుతుందా?
కొంచెం తగ్గుతది: **48.6%**
ప్రయోజనం లేదు: **26%**

అధికారులతో పనిచేయించుకోవడానికి ఏం వాడుతరు?
లంచం వాడుతం: **43%**
న్యాయపోరాటం : **41%**

అవినీతికి ప్రధాన కారణం ఎవరు?
ఉద్యోగులు, నాయకులు: **65%**

అధికారులు లంచం ఎలా తీసుకుంటారు?
బ్రోకర్ల ద్వారా: **54.8%**
డైరెక్టుగా : **30.8%**

ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు కనీస మర్యాద ఇస్తున్నారా?
పట్టించుకోరు : **64.4%**
దురుసుగా ప్రవర్తిస్తారు: **16.4%**

దళారీ వ్యవస్థతో అవినీతి పెరుగుతుందా?
పెరుగుతుంది : **47.9%**
దళారులే ప్రధాన కారణం: **28.1%**

తెలంగాణలో కొత్త ప్రభుత్వ తీరు ఎలా ఉన్నది?
ఫర్వాలేదు: **41.8%**
బాగా లేదు: **25.3%**
అధ్వాన్నం: **23.3%**

మీరు ఓటేసిన నాయకులు మీ సమస్యలు చెప్పకోవడానికి వెళ్లినప్పుడు కలుస్తారా?
వాళ్లకోసం తిరగాలి: **36.3%**
ఎక్కడ ఉంటరో తెలియదు : **24%**

అవినీతి నిర్మూలన కోసం మా సంస్థతో కలిసి పనిచేస్తారా?
కలిసి పనిచేస్తాం: **80.1%**

కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

క్రిస్మస్‌ను పురస్కరించుకొని తెలంగాణ పుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ బుధవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా న్యూ లైఫ్ చర్చి బిషప్ నెహేమియా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి కేసీఆర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్టియన్ జేఏసీ నాయకుడు సోలోమన్ రాజు, క్యాథలిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ లియో లూయిస్ పాల్గొన్నారు.

'రియల్' మూసీబత్!

మొదటిపేజీ తరువాయి...

నగరం మధ్యలో నుంచి ప్రవహిస్తుంది. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడికి టూర్‌కు వచ్చినపుడు ఈ విషయాన్ని తెలుసుకొని ఇప్పుడు మమ్మల్ని పంపించాడు. చుంగ్ చై చున్ పక్కనే రెస్టారెంట్లు, ఇవన్నీ (ఆకాశహర్మ్యాలు) వచ్చినయి. ఇవన్నీ పీపీపీ (పబ్లిక్-ప్రైవేటు-పార్ట్‌నర్‌షిప్) విధానంలో వచ్చిన ప్రాజెక్టులు. హైదరాబాద్‌లోని మూసీని కూడా ఇట్ల తయారు చేస్తే ప్రపంచంలోనే గుర్తింపు వస్తుంది...' అని కొన్నిరోజుల కిందట సియోల్ పర్యటనకు వెళ్లిన మంత్రుల బృందం స్పష్టంగా చెప్పింది. దీంతో అప్పుడే మూసీ పరివాహక భవిష్యత్తుపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనికి తోడు ప్రజా సంఘాలకు కొన్నిరోజుల కిందట మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రజా సంఘాలకు ఇచ్చిన ప్రజంటేషన్‌లోనే మూసీకి రెండువైపులా కిలోమీటరు చొప్పున గ్రోత్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని, ఆ మేరకు భూసేకరణ చేపడతామని కూడా స్పష్టం చేశారు. దీంతో సియోల్ పర్యటనలో మంత్రులు చెప్పిన ఆకాశహర్మ్యాల ప్రాజెక్టులే రాష్ట్ర ప్రభుత్వ అసలు లక్ష్యంగా బహిర్గతమైంది.

ప్రాథమిక నివేదికలో గుట్టురట్టు...

మూసీకి పూర్వ వైభవం తీసుకురావాలంటే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుంది. తద్వారా మూసీ పరివాహకం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని అంటున్నది. కానీ కొన్నిరోజుల కిందట ఎమ్మెల్సీ కవిత బయటపెట్టిన ప్రపంచ బ్యాంకు ప్రాథమిక ప్రాజెక్టు నివేదికలో మూసీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కారు అసలు ఉద్దేశమేందో రట్టయింది. నిర్మాణాలను తొలగించాలని

చెబుతున్న ప్రభుత్వం మూసీ ప్రాజెక్టులో భాగంగా రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్‌ను నివేదికలో అనేక సార్లు ఉటంకించడమే ఇందుకు నిదర్శనం. ఈ నివేదికలో అనేక చోట్ల మూసీ పరివాహకంలో పబ్లిక్-ప్రైవేటు-పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో కార్పొరేట్ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించి రియల్ ఎస్టేట్ డెవపల్‌మెంట్ చేస్తామని స్వయంగా అంగీకరించింది. పర్యాటకం, వినోదం, రియల్ రంగాలకు సంబంధించిన పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన ఆదాయవనరుగా కూడా పేర్కొన్నది. ఈ నేపథ్యంలో నిరుపేదల ఇండ్లను కూల్చివేయడమంటే మూసీని ప్రక్షాళన చేయడం కాదనేది, మూసీ సుందరీకరణ కోసమే అనేది అర్థమవుతుంది. అంటే నిరుపేదల ఇండ్లను కూల్చివేసిన చోట ఆకాశహర్మ్యాలు నిర్మించేందుకు కూడా కార్పొరేట్ పెట్టుబడులను ఆకర్షిస్తారని స్పష్టమవుతుంది. అయితే మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.లక్షన్నర కోట్లు అని సీఎం రేవంత్ స్వయంగా చెప్పిన దరిమిలా మూసీకి రెండువైపులా రియల్ ఎస్టేట్ అభివృద్ధి కేవలం ఎఫ్‌టీఎల్, బఫర్‌కు మాత్రమే పరిమితం కాకుండా రెండువైపులా కిలోమీటరు చొప్పున ఉంటుందనే వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి.

పేదల ఇండ్ల కూల్చివేతకు పచ్చజెండా ఊపుతుందా?

మూసీ ప్రాజెక్టులో తాజాగా మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. రేవంత్ సర్కారు ప్రపంచ బ్యాంకు రుణం తీసుకునేందుకు కేంద్రం అనుమతి తీసుకోవాల్సి ఉంది. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4100 కోట్ల రుణాన్ని తీసుకోవాలని భావిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.1763 కోట్లు కలిపి రానున్న ఏడేండ్లలో ఖర్చు చేస్తామని ప్రపంచ బ్యాంకుకు ఇచ్చిన ప్రాథమిక ప్రాజెక్టు నివేదిక (పీపీఆర్)లో పేర్కొన్నది. దీంతో కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. ప్రస్తుతం మెయిన్‌హార్ట్ కన్సార్టియం ద్వారా ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్, డీపీఆర్ రూపకల్పనకు కసరత్తు చేస్తున్నది. డీపీఆర్ పూర్తయిన తర్వాత దానిని కేంద్రానికి పంపాల్సి ఉంది. ప్రపంచ బ్యాంకు రుణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల కూల్చివేతలు, పునరావాసం వంటి చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉంది. కానీ తెలంగాణ బీజేపీ నేతలు మాత్రం పేదల ఇండ్ల కూల్చివేతకు తాము వ్యతిరేకం అని ఇక్కడ ప్రకటిస్తున్నారు. అంతే కాదు.. ఒకడుగు ముందుకేసి కేంద్ర మంత్రులు సహా బీజేపీ ప్రజాప్రతినిధులు, కీలక నేతలు మూసీ నిద్ర కూడా చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వం పంపిన డీపీఆర్‌కు సమగ్రంగా పరిశీలించి మార్పులను సూచిస్తుందా? యదాతథంగా ఆమోదం తెలుపుతుందా? ఒకవేళ కూల్చివేతలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే తెలంగాణ బీజేపీ బాధితులకు ఏం సమాధానం చెబుతుంది? ఇలా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

లోకం పోకడ



కేంద్రంలో మార్పునకు శ్రీకారం చుట్టారట!

రైతుల భాగస్వామ్యంతోనే దేశ పురోభివృద్ధి

- ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్

నర్సాపూర్/కౌడిపల్లి, డిసెంబర్ 25: భారత ఆర్థిక వ్యవస్థలో రైతుల భాగస్వామ్యం ఉంటేనే దేశం పురోభివృద్ధి చెందుతుందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పేర్కొన్నారు. బుధవారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికి ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రకృతి, సేంద్రియ రైతుల సమ్మేళనానికి ఉపరాష్ట్రపతి సతీమణి డాక్టర్ సుదేశ్ ధన్‌కర్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

28న బీసీ మేధోమథన సదస్సు

హైదరాబాద్, డిసెంబర్25 (నమస్తే తెలంగాణ): ఈ నెల 28న బీసీ మేధోమథన సదస్సు నిర్వహించనున్నట్టు జాతీయ సామాజిక న్యాయవేదిక, బీసీ రాజకీయ ఫ్రంట్ ప్రకటించాయి. '75 సంవత్సరాల భారత రాజ్యాంగం-రాజకీయ అంటరానితనంలో బీసీలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించాయి. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న ఈ సదస్సుకు మేధావులు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాల నేతలు హాజరుకావాలని పిలుపునిచ్చాయి.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

- రాష్ట్రంలో రెండు రోజులు వర్షాలు

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతున్నది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రెండు రోజులపాటు మోస్తారు వర్షాలు కురువొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలో చాలా చోట్ల మోస్తారు వర్షాలు కురిశాయని వెల్లడించింది. నల్లగొండ జిల్లా మాటూరులో 1.1 సెంటీమీటర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో 1.1 సెంటీమీటర్ల వర్షం కురిసిందని తెలిపింది. ఏపీలోనూ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

వీవోఏ తొలగింపు.. కలెక్టర్‌పై కేసు

- మరో 11 మంది అధికారులపైనా నమోదు
- జనగామ జిల్లా కోర్టు తీర్పు నేపథ్యంలో..

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబర్ 25: న్యాయం కోసం నాలుగేళ్లుగా రాజీలేకుండా ఆమె చేసిన పోరాటం ఫలించింది. అధికార దుర్వినియోగానికి పాల్పడినందుకు ఏకంగా అప్పటి కలెక్టర్‌తోపాటు మరో 11మందిపై కేసులు నమోదు చేయాలని జనగామ జిల్లా కోర్టు ఇటీవల సంచలన తీర్పునిచ్చింది. ఈ మేరకు అప్పటి కలెక్టర్ శివలింగయ్య, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఐకేపీ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్‌తోపాటు మొత్తం 12మందిపై స్టేషన్‌ఘనపూర్ పోలీసులు మంగళవారం పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వివరాలు ఇలా.. చాడ సునీత తాటికొండలో స్వర్ణ విజయం స్వయం సహాయక గ్రూపు విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించేది. ఆమె కేవలం రికార్డులు మాత్రమే రాసేది. అయితే ఏపీఎం కవితతో ఆమెకు అభిప్రాయబేధాలు తలెత్తాయి. ఉద్దేశపూర్వకంగా ఏపీఎం కవిత తన మీద రూ.20.50 లక్షల అవినీతి ఆరోపణలను మోపి 2020-21లో వీవోఏ బాధ్యతల నుంచి తొలగిం చేలా చేసింది. ఐకేపీ అధికారులు ఏపీఎం ఇచ్చిన సమాచారాన్నే విశ్వసించి సునీత రూ.20.50 లక్షలు కట్టాలని రికవరీ నోటీసులు ఇవ్వడమే కాకుండా మైకులు పెట్టి గ్రామంలో చాటింపు వేశారు. ఈ ఘటనతో సునీత కలత చెందింది. రికార్డులను ఆడిట్ చేయించాలని ఆమె అప్పటి కలెక్టర్ శివలింగయ్యకు విజ్ఞప్తి చేయగా పట్టించుకోలేదు. తనకు న్యాయం చేయాలని ఆమె ఎస్సీ కమిషన్‌ను, హెచ్చార్సీని సంప్రదించింది. 2020 జూన్‌లో కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో గత నెల సునీతకు అనుకూలంగా జనగామ జిల్లా కోర్టు తీర్పు ఇచ్చి విచారణకు ఆదేశించింది. అప్పటి కలెక్టర్‌తోపాటు మరో 11 మందిపై కేసు నమోదు చేయాలనే కోర్టు ఆదేశాల మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసులు ఈనెల 23న కేసు నమోదు చేశారు.

నేడు టెట్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 25 (నమస్తేతెలంగాణ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) హాల్‌టికెట్లు గురువారం విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. 2 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2.75 లక్షల మంది అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు.

అకాల వర్షం.. పంటలకు నష్టం

తీవ్ర అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు వర్షం కురవడంతో పంటలకు నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. మిర్చి చేన్లలోకి నీరు చేరింది. కళ్లాల్లో ఆరబెట్టిన మిర్చి నల్లబడి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మామిడి తోటలు పూత దశలో ఉండగా, రాలిపోవడంతో పాటు తెగుళ్లు వచ్చి నల్లబడే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

ములుగులోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని నేర్పుతున్న రైతులు

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట కొనుగోలు కేంద్రంలో నిలిచిన నీటిని బయటకు తీస్తున్న రైతు

కడుపునొప్పితో గురుకుల విద్యార్థిని మృతి

జైనూర్, డిసెంబర్ 25 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం సాసిమెట్ట గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్రం పార్వతి (12) బుధవారం కడుపునొప్పితో మృతి చెందింది. జాడుగూడకు చెందిన ఆత్రం పార్వతి సాసిమెట్ట గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నది. పొలాల అమావాస్యకు ఇంటికి వచ్చింది. ఆపై జ్వరంతో పాటు కడుపునొప్పి రావడంతో ఉట్నూర్‌లోని ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. మూడు వారాల క్రితం డిశ్చార్జి చేశారు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నది. ఈ క్రమంలో బుధవారం కడుపునొప్పి తీవ్రమై మృతి చెందినట్టు బాలిక తండ్రి ఆత్రం భీంరావు, మామ రాజు తెలిపారు.

మా దారికొస్తే సరే.. లేదంటే ఖబడ్దార్!

- క్రషర్ల యజమానులకు గనుల శాఖ వేధింపులు.. భారీ జరిమానాలు
- 2 మీటర్ల డీవియేషన్‌కు 21 కోట్ల పెనాల్టీ
- ఇప్పటికే 261 క్రషర్లు సీజ్..
- మూసివేత బాటలో మరికొన్ని..
- పరోక్షంగా బేరసారాలు?
- హడలిపోతున్న యజమానులు

హైదరాబాద్, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ): మైనింగ్‌కు సంబంధించిన చిన్నచిన్న డీవియేషన్లకు కూడా గనుల శాఖ అధికారులు భారీ జరిమానాలు విధిస్తుండటంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని క్రషర్ల యజమానులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మూడు, నాలుగు హెక్టార్లలో ఉన్న చిన్న చిన్న మైనింగ్‌లో సైతం ఒకటి-రెండు మీటర్లు డీవియేషన్ జరిగినట్టు గుర్తించినవాటికి రూ.20 కోట్లు, రూ.30 కోట్లు చొప్పున జరిమానాలు విధిస్తుండటంతో క్రషర్ల యజమానులు లబోదిబోమంటున్నారు. పది హెక్టార్లు, అంతకన్నా ఎక్కువ వైశాల్యం ఉన్న గనులకు రూ.వంద కోట్లకుపైగా పెనాల్టీలు విధిస్తున్నారు. భారీ పెనాల్టీలు చెల్లించకలేక పలువురు గనులను మూసివేసుకోగా, జరిమానాలు చెల్లించలేదనే కారణంతో అధికారులు 261 క్రషర్లను సీజ్ చేశారు. మరికొన్ని క్రషర్లు మూసివేత బాటలో ఉన్నాయి. గనుల శాఖ వేధింపుల వెనుక అధికార పార్టీకి చెందిన కొందరు నేతల ప్రమేయం ఉన్నదని, ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో దశాబ్దాల క్రితం మంజూరైన మైనింగ్ లీజులే కొనసాగుతున్నాయి. ఇటీవల అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్ సర్వే చేపట్టిన గనుల శాఖ ఒక్కో మైనింగ్ వద్దకు వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నది. దీంతో గతంలో నిర్ధారించిన సరిహద్దులకు, ఇప్పుడు ఈటీఎస్ సర్వే ద్వారా నిర్ధారిస్తున్న సరిహద్దులకు పొంతన కుదరడంలేదు. కొందరు గనుల యజమానులు అనుమతి కన్నా ఎక్కువ మైనింగ్ చేసిన ఘటనలు వెలుగుచూస్తుండగా, కొన్నిచోట్ల సర్వేలో లోపాల వల్ల డీవియేషన్ జరిగినట్టు తప్పుడు నిర్ధారణ అవుతున్నదని చెప్తున్నారు. మైనింగ్‌లో డీవియేషన్లు గుర్తిస్తే, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం, అవసరమైతే లీజులు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం గనుల శాఖ ఇందుకు విరుద్ధంగా క్రషర్లను లక్ష్యంగా చేసుకొని దాడులు నిర్వహిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని క్రషర్లను చూసీచూడనట్టు వదిలేస్తూ, మరికొన్నింటిని మూసివేస్తున్నారనే ఆరోపణలున్నాయి. శాస్త్రీయ పద్ధతుల్లో డీవియేషన్లను నిర్ధారించి జరిమానాలు విధించే అధికారం గనుల శాఖకు ఉన్నదని, ఏకపక్షంగా డీవియేషన్లను నిర్ధారించి ఇష్టారాజ్యంగా పెనాల్టీలు విధిస్తున్నారని గనుల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

వెయ్యి కోట్ల ఆదాయమే టార్గెట్‌గా..

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక కంకర రాయల్టీని టన్నుకు రూ.250 నుంచి రూ.395కి పెంచడంతోపాటు పర్మిట్ ఫీజు పేరుతో అదనంగా మరో రూ.58 వసూలు చేస్తున్నారు. దీనివల్ల నేరుగా టన్నుపై రూ.200కుపైగా ప్రజలపై భారం పడుతున్నది. క్రషర్లపై తనిఖీల పేరుతో గనులు, రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసి క్వారీలు, క్రషర్లపై నిత్యం దాడులు నిర్వహిస్తున్నారు. రాయల్టీ సరిగా చెల్లించడంలేదని, అనుమతించిన దానికన్నా ఎక్కువ మైనింగ్ చేస్తున్నారంటూ భారీ పెనాల్టీలు విధిస్తున్నారు. దీంతో కంకర, మ్యానిఫ్యాక్చరింగ్ శాండ్ (రోబోశాండ్) ధరలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 750 వరకూ స్టోన్ క్రషర్లు ఉండగా, నిరుడు రాయల్టీ ద్వారా రాష్ట్రానికి రూ.650 కోట్ల వరకు ఆదాయం సమకూరింది. ఈ ఏడాది రూ. 1,000 కోట్ల ఆదాయం రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని, ఇందులో భాగంగానే గనులపై దాడులు నిర్వహిస్తున్నట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి.

గనులపై అధికార పార్టీ నాయకుల కన్ను!

గనుల శాఖ అధికారులు చెప్తున్నదానికీ, బయట జరుగుతున్న ప్రచారానికి పొంతన కుదరడం లేదు. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు తమతమ ప్రాంతాల్లో నడుస్తున్న గనులను సొంతం చేసుకునేందుకు గనుల శాఖ అధికారులను పావులుగా వాడుకుంటున్నారనే విమర్శలున్నాయి. కొందరు మైనింగ్ నిర్వాహకులకు అధికారుల ద్వారా పరోక్ష హెచ్చరికలు కూడా వెళ్లినట్టు, 'ఫలానా' నేతలను ప్రసన్నం చేసుకుంటే మీకు ఇబ్బందులు ఉండవని అధికారులు వారికి సూచిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. నిబంధనలను తుంగలోతొక్కి ఎక్కడా లేనివిధంగా కోట్లలో పెనాల్టీలు విధిస్తూ క్రషర్ల నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్తున్నారు. ప్రస్తుతం అధికారుల వైఖరి మైనింగ్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. ఏ నిబంధన ప్రకారం ఇంత భారీస్థాయిలో పెనాల్టీలు విధిస్తున్నారో అధికారులు చెప్పడంలేదని, దేశంలో ఎక్కడా లేనివిధంగా క్రషర్లను లక్ష్యంగా చేసుకొని అధికారులు దాడులకు దిగుతున్నారని వాపోతున్నారు. క్రషర్లను మూసివేసి 'తమ దారికి' తెచ్చుకునేందుకే కనీవినీ ఎరుగని రీతిలో పెనాల్టీలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు.